# పసి హృదయాలు

చెట్లు పరిగెడుతున్నాయి. టెలిగ్రాఫ్ స్తంభాలూ పరుగెడుతున్నాయి వెనక్కి. కాలి దారి రబ్బరులా సాగుతూ, మెలికలు తిరుగుతూ వెంటాడుతోంది రైలు బండిని. శూన్యాన్ని చీల్చుకుంటూ, గాలితో యుద్ధం చేస్తూ, హుషారుగా ఈలవేస్తూ పోతోంది రైలు.

కిటికీ అంచున తల ఆన్చి చూస్తూ కూర్చున్నాను. చెట్ల పరుగు చూస్తూ కూర్చున్నాను. రైలు చక్రాల లయ వింటూ కూర్చున్నాను.

విసుగేసింది. సీటుకు జేరబడి సంచి తెరిచి పుస్తకం తీసుకునే ప్రయత్నంలో వున్నాను.

"మీ పేరేమిటండీ?" అడుగుతోంది నాలుగైదేళ్ళ ఆడపిల్ల. ఇంకో చిన్న పిల్లవాడు కూడా నా జవాబు కోసమే కుతూహలంగా చూస్తున్నట్టు నిలబడ్డాడు.

ఆ పిల్లలూ, తల్లీ కిందటి స్టేషన్‌లో ఎక్కినట్టున్నారు. నేను సరిగ్గా గమనించ లేదు. ఆ పిల్లలు చేసే అల్లరీ. వేసే ప్రశ్నలూ, ఆవిడ ఇస్తోన్న జవాబులూ, నేనేమంత పట్టించుకోకపోయినా అన్నీ విన్పిస్తూనే వున్నాయి.

పిల్లలిద్దరూ ముద్దుగా, ఆరోగ్యంగా వున్నారు. ఒత్తుగా కుచ్చెళ్ళతో, పొట్టి చేతులతో, నడుం మీదికి కుచ్చులు బిగించిన పెద్ద పెద్ద పువ్వుల సిల్కుగౌను వేసుకుందా అమ్మాయి. అబ్బాయికూడా నిక్కరులో బిగించుకున్న తెల్లటి బుష్ కోటుమీద చిన్ని చుక్కల టై కట్టుకున్నాడు. ఇద్దరికీ ఖరీదైన బూట్లూ మేజోళ్ళూ వున్నాయి. అమ్మాయి జుట్టు గిరజాలుగా దువ్వి వదులుకుంది. అబ్బాయి గోధుమ రంగు హేటు పెట్టుకున్నాడు. పిల్లలిద్దరూ చూడ్డానికి ఎంతో ముద్దుగా వున్నారు. తల్లి కూడా కొంచెం ముస్తాబుతో, నగలతో, ఆ పిల్లల తల్లి అనుకునేలాగే వుంది. సన్నటి అంచుతో ఎర్రటి ఎరుపు పట్టుచీరా, బూటులా భ్రమింపజేస్తోన్న జోళ్ళూ, రిస్టువాచీ, తెలీని వాళ్ళు పోల్చలేని రెండు జడల ముడీ, చాలా నాగరీకంగా వుంది. పిల్లలిద్దరూ నాకు దగ్గరగా నా సంచి దగ్గిరికి చేరి నిలబడ్డారు.

ఆ పిల్ల అడిగిన ప్రశ్న మనసులో మననం చేసుకుంటూ, నవ్వుతూ అన్నాను, "నా పేరెందుకు నీకు?"

కాస్త సిగ్గుపడిందా పిల్ల "ఊరికేనే."

"నీ పేరేమిటో ముందు చెప్పు."

"మంజులత" — ఉత్సాహంగా చెప్పేసింది.

"మంజులతా? చాలా బాగుంది."

"మంజులతేవిటి? మంజుల అని చెప్పు. దాని పేరు మంజులేనండీ!" అంది నాకేసి చూస్తూ పిల్లల తల్లి.

పిల్ల బిక్క మొహం వేసింది. "ఊహూ! కాదు, అలా నాకొద్దు, నాపేరు మంజులతే" అంది బింకంగా.

"ఏడిశావ్‌లే! మోటుగా ఎందుకంత పొడుగు పేరు? ఈ రోజుల్లో ఫాషనేమిటి?" కసురుతోన్నట్టే అంది వాళ్ళమ్మ. పాప మాట్లాడలేకపోయింది. ఆవిడ నన్నే మధ్యవర్తిగా పెట్టింది. "మీరు చెప్పండి, మంజుల బాగుందా, మంజులత బాగుందా?" అంది.

నేను నవ్వాను. ఆ అమ్మాయిని చూస్తుంటే జాలేసింది. "పాప కే పేరు ఇష్టమైతే అదే వుంచుకోనివ్వండి. అవునా పాపా?" అన్నాను పాప బుగ్గ తాకుతూ.

ఆవిడ అదో మాదిరిగా నవ్వేసింది. పాప మొహం మళ్ళీ కళకళ్ళాడింది.

"మీ తమ్ముడి పేరేమిటి మంజులతా?" అన్నాను పాపని చూస్తూ.

"నా పేరు శరత్తండీ! శరత్ కుమారండీ! మా అమ్మ వెంకటేసర్రావని కూడా పిలుస్తుందండీ" అన్నాడు అబ్బాయి గబగబా.

"అదేమిటి? రెండు పేర్లా నీకు?"

ఆవిడ వెంటనే "వాడు కడుపులో వున్నప్పుడు మా అమ్మ, ఈసారి మొగపిల్లాడవ్వాలని మొక్కుకుంది లెండి. ఆ పేరేపెట్టి పిలుస్తారు మా వాళ్ళంతా" అంది.

"అయితే నీకేపేరు ఇష్టమోయ్?" అని అడగబోయి మానేశాను. మళ్ళీ తల్లితో గొడవ, ఆ పిల్లాడికి!

"ఊఁ, బాగుంది. నీ పేరుకూడా చాలా బాగుందోయ్ శరత్‌కుమార్!"

"మీ పేరేమిటో చెప్పనేలేదు" ఈసారి పెద్దావిడే అంది.

నేను నవ్వాను "నా పేరు మీకు నచ్చదులెండి. చాలా పాత పేరు. ఈ రోజుల పేషనేం లేదు" ప్రతి మాటా నొక్కి నొక్కి అన్నాను.

"మేడమ్! ప్లీజ్, టికట్!"

పర్సు తీసి టీ.సీ.కి టిక్కట్ చూపించి తిరిగి జాగ్రత్త చేశాను. ఆవిడ .... ఆవిడ పేరేంటో నాకు తెలీదు, రైలు దిగే లోపల ఆవిడ పేరు నాకు తెలీనే లేదు, కాబట్టి ఆవిణ్ణి దుర్గాంబ అంటాను. పాపం, ఆ పేరు ఆవిడికి నచ్చదు. సరే! దుర్గాంబకూడా నాలాగే ఒక్క టిక్కట్టే తీసి ఇచ్చింది. అది అందుకుంటూ "పిల్లలిద్ద రికీ టిక్కట్లు వుండాలమ్మా!" అన్నాడు టీసీ.

"అబ్బే! వాళ్ళింకా చిన్నవాళ్ళండీ! అబ్బాయికి మూడేళ్ళు కూడా నిండలేదు" అంది.

నా ప్రాణం సిగ్గుతో చితికిపోయినట్టయింది. ఆ టీసీ కూడా ఆవిణ్ణి వదిలేసి నాకేసి చూశాడు విచి త్రంగా. "మీ ఆడ జాతి అబద్ధాలకు నువ్వే సాక్ష్యం" అన్నట్టు!

టీసీ ఆవిడితో మళ్ళీ అన్నాడు. "లేదమ్మా! ఈ పిల్లలిద్దరికీ టిక్కట్లు వుండాలి."

ఆవిడ .... దుర్గాంబ .... దబాయించే ధోరణితో అంది. "రాజమండ్రి స్టేషన్ మాష్టర్ని అడిగే ఎక్కానండీ! టిక్కట్లు అవసరం లేదన్నారు."

టీసీ ఒక్క నిముషం నిశ్శబ్దంగా వుండి "ఆయన ఏదైనా కాయితం రాసి ఇచ్చారా?" అన్నాడు.

"లేదండీ! అలా కాయితాలవీ కావాలని నాకు తెలీలేదు. లేకపోతే రాజమండ్రీ లోనే ...."

"అమ్మా! మనం రాజమండ్రీలోనా ఎక్కింది?" ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేస్తూ అడిగాడు పిల్లవాడు.

దుర్గాంబ కొడుక్కేసి ఎర్రగా చూస్తోంటే టీసీ రెండడుగులు ముందుకు వేశాడు. "డబ్బు తీసి వుంచండి! మిగిలిన టిక్కట్లు చూసుకుని వస్తాను."

ఆవిడ రెండు నిముషాలు అలాగే కూర్చుంది. తర్వాత హేండ్‌బాగ్ తెరిచి నోట్లు లెక్కపెట్టుకుంది. మళ్ళీ టీసీ వచ్చి మార్వాడీలా నిలబడ్డాడు.

"పోనీ చంటివాణ్ణయినా విడిచి పెట్టరూ?" అంది ఆశగా చూస్తూ. ఎంతో పరిచయం వున్న మనిషిలాగే చూసింది అతన్ని.

టీసీ మాట్లాడలేదు. చకచకా రాసేశాడు. ఫర్రు ఫర్రున రెండు కాగితాలు చింపి ఇచ్చి నోట్లు అందు కున్నాడు.

తల్లిని హడలుగొడుతున్న ఆ పెద్ద మనిషి కేసి విస్మయంగా చూశారు పిల్లలు. అతగాణ్ణి దబాయించ లేకపోయిన తల్లికేసి సానుభూతిగా చూశారు.

టీసీ వెళ్ళగానే అబ్బాయి తల్లిదగ్గిర చేరాడు.

"అమ్మా! ఎవడేవాడు! పోలీసా?"

ఆవిడ, మొహం చిట్లించుకుంటూ ఈసడింపుగా "ఎవడో దరిద్రుడు. ఉద్యోగం కాస్తా వూడేదాకా ఇలాగే దండుకు తింటాడు!" అంది.

"చేతికి బిల్లు ఇస్తే దండుకోడం ఏమిటండీ?" అందామనుకున్నాను.

"అమ్మా! మనం కొవ్వూరులో కదే ఎక్కిందీ?"

ఆవిడ కోపమంతా కొడుకు మీదకి మళ్ళింది. "గంగలో ఎక్కాంరా! వాడి ఎదటేనా నువ్వు అడిగేది?"

"ఏం, అడిగితే?"

"వెధవ అడ్డదిడ్డం ప్రశ్నలు వెయ్యకు!"

తల్లి కోపం చూస్తోంటే నిజంగా భయం వేసింది శరత్‌కి. నెమ్మదిగా అక్కదగ్గిర చేరాడు. "అక్కా! వాడు పోలీసు వాడిలా చక్కగా లేడూ?"

అవునన్నట్టు గబగబా తల ఊపింది అక్క.

"మనం పోలీసు ఆట ఆడుకుందామా? నేను టిక్కట్టడుగుతానంట. నువ్వు ఇచ్చెయ్యాలి."

"నాదగ్గిర లేదుగా?"

పిల్లలు కాసేపు యోచించారు. తల్లిని చూస్తూ ముద్దుగా అడిగారు. "అమ్మా! టిక్కట్టియ్యవే, ఆడు కుంటాం."

నవ్వొచ్చింది నాకు.

వాళ్ళమ్మ కసురుకుంది. "ఏడ్చినట్టే వుంది. వెధ వాటా మీరూనూ."

"టిక్కట్లాట బాగుంటుందమ్మా!"

"ఛీ! వెధవ బాగు. టికట్టు కలక్టరు ఆటేమిటి? డాక్టరు ఆట ఆడుకోండి."

"ఛీ! డాక్టరు నా కొద్దు. ఇండీషను .... నెప్పి."

నేను వూరుకోలేక దుర్గాంబకేసి చూస్తూ అన్నాను — "మీ అబ్బాయి మనసు మెత్తన."

"ఆఁ, వాడి మాటలకేంలెండి. ఎప్పుడూ అలాగే వాగుతాడు. డాక్టరు అంటే మొహం ముడిచేసు కుంటాడు."

"డాక్టరవ్వాలంటే అబ్బాయి కా అభిరుచి వుండాలి కదా?"

"వాడి నెత్తి, వాడికేం తెలుసు? డాక్టరంటే పేరుకి పేరూ డబ్బుకి డబ్బూ! పిల్లలకి అవన్నీ తెలుస్తాయా?"

"మరి అమ్మాయినేం చదివిస్తారు?"

"దానికేం చదువు? ఆడపిల్ల! అంత చదువుతా నంటే స్కూలు ఫైనల్ చదివి మానేస్తుంది. నేనూ అంతే."

తనకి తల్లి ఏదో కొరత చెయ్యబోతున్నట్టు మంజులత నాకేసి దీనంగా చూసింది.

నేను నవ్వుతూ ఆవిడితో అన్నాను "మంజులతే డాక్టరు అవ్వాలండీ! చూడండి, ఇంత మెత్తని చేతుల్తో పేషెంటుని ముట్టుకుంటే ఇంకేం మందులు కావాలి?"

ఆవిడ కొంచెం నవ్వింది.

నెమ్మదిగా పిల్లలు నా దగ్గిరికి చేరారు.

"ఏమండీ! మీ పేరు మంజులతేనా?" హఠాత్తుగా అడిగింది మంజులత. అవునంటానన్నంత ఆశగా చూసింది. నా పేరు తెలుసుకోవాలని ఆ పిల్లకి ఎందుకో అంత సరదా!

"నాకు పేరు లేదమ్మా!" అన్నాను నవ్వుతూ.

ఆశ్చర్యంగా చూసింది మంజులత "నిజంగా మీకు పేరు లేదాండీ? మిమ్మల్ని ఎలా పిలుస్తారండీ?"

"మీరు మాత్రం 'అత్త' అని పిలవండి, బాగుందా?"

"రైలత్త .... రైలత్త ...." అని అరిచారు పిల్లలు.

"సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకామూ రామా చంద్రా!

ఆ పతకానికే పట్టే పదివేలా వరహాలూ రామా చంద్రా!"

పిల్లలిద్దరూ చటుక్కున అల్లరి మానేసి ఆ బిచ్చగత్తెకేసి చూస్తూ నిలబడ్డారు.

దుర్గాంబ హేండ్ బాగ్ తెరిచింది డబ్బులకోసం.

"అమ్మా! నేనిస్తానే, నే నిస్తానే!" అంటూ ఎగబడ్డారు పిల్లలు.

"పెద్దదాన్ని వుండగా మీ కెందుకు వెధవ పెత్తనం?" అంటూ దుర్గాంబ బిచ్చగత్తె చేతిలో ఎత్తి పడేసిందో డబ్బు.

పిల్లలు చిన్నబుచ్చుకుని వూరుకున్నారు.

నేను రెండణాలు తీసి ఇద్దరు పిల్లలకీ ఇచ్చాను.

వాళ్ళు సంతోషంతో ఆ డబ్బులు ఆమె చేతిలో వేశారు.

మంజులత వాళ్ళమ్మ దగ్గిర కూర్చొని అడిగింది — "అమ్మా! దాని కళ్ళెందుకు అలా మూసేసుకుంది?"

"అది గుడ్డిది. కళ్ళు కన్పించవు."

"ఎందుకు కన్పించవూ?" పిల్లాడు కూడా అక్కడికి చేరాడు.

"అది ఏదో పాపం చేసింది."

"ఏం చేసిందమ్మా?"

"ఏమో! మనకెలా తెలుస్తుంది? దేవుడికి తెలుస్తుంది —"

"దేవుడు గుళ్ళోనే కూర్చుంటాడుగా? వాడికెలా తెలుస్తుంది?"

"తప్పు. దేవుణ్ణి వాడు అనొచ్చునా?"

"అక్కా! దేవుడుగారు అనాలే!"

"....... అమ్మా! దేవుడుగారి కెలా తెలుస్తుం దమ్మా?"

"అబ్బ! ఏవిట్రా మీ ప్రశ్నలూ? దేవుడికి ఎవళ్ళు మంచివాళ్ళో ఎవళ్ళు చెడ్డ వాళ్ళో అన్నీ తెలుస్తాయి."

ఆ బిచ్చగత్తె, పాట తిరగవేస్తూ మళ్ళీ వెనక్కి వచ్చింది.

"అమ్మీ! ఒక్కసారి పాట ఆపు!" అన్నాను కాస్త గట్టిగా. పాట ఆగిపోయింది.

"నీ కళ్ళెందుకు పోయాయి? పుట్టినప్పుడే అలా వున్నాయా? మధ్యలో ఏదైనా జబ్బు చేసిందా?" అని అడిగాను.

పిల్లలిద్దరూ నా దగ్గిరకి చేరారు.

"ఎవరమ్మా ఆ తల్లి? అంత చల్లగా అడుగుతాది? ఎన్నిసార్లు చెప్పుకుంటే అన్నిసార్లు నా కడుపు చల్లబడతాదమ్మా!" బొడ్లోంచి నల్లటి గుడ్డమూట తీసి చేతిలో డబ్బులు మూటలో కట్టుకుంటూ చెప్పింది. "ఏడాది జరిగిపోనాదమ్మా! ఒక మా తల్లి సికారు తిరుగుతా కారుబండి నా మీదికి తోలేసినాది. దర్మాసుపటేల్లో జబ్బుకుక్కలాగ నాలుగు నెల్లు పడున్నాను, కళ్ళు పోనాయి, నా బతుకుదెరువే పోనాది. కూరగాయలమ్ముకునే దాన్నమ్మా! ఈ ముస్టి బతుకేం ఖరమ తల్లీ?" అని మళ్ళీ పాట పాడుకుంటూ వెళ్ళిపోయింది.

నేను దుర్గాంబకేసి చూశాను — 'ఆ మనిషి చేసిన పాపం ఏమిటో ఇప్పుడు చెప్పు' అన్నట్టు.

"ఎన్ని అబద్ధాలు చెప్పకపోతే దానిపొట్ట నిండుతుంది లెండి" అందావిడ. ఎందుకా అకారణ ద్వేషం, ఆ మనిషి మీద?

"అమ్మా! ఏమిటే అది చెప్తోందీ? కారు కింద పడిపోయానంటోంది కదా?"

"పడిపోతే మాత్రం? ఏ చేతికో కాలికో దెబ్బతగిలి మానకూడదూ? కళ్ళే పోవాలా?" అందావిడ.

పిల్లలు తెల్లమొహాలేశారు.

"మంచివాళ్ళని తీసికెళ్ళి రైలు కిందికి తోసేస్తే

చావరాండీ?" అన్నాను.

దుర్గాంబ వినీ విననట్టు వూరుకుంది.

"అమ్మా! అదెప్పుడూ దేవుడుగారికి కొబ్బరి కాయలు కొట్టలేదా?" అంటున్నారు పిల్లలు తల్లితో.

"ఏం? మీరు కొడుతూ వుంటారా?" అన్నాను నేను పిల్లలతో.

కుమార్ ఉత్సాహంగా చెప్పాడు — "నేనూ మా అక్కాకూడా దేముడు గారికి కొబ్బరికాయలు ఇచ్చి పూజ చేస్తామండీ? మా అమ్మ చేయిస్తుందిగా?"

"ఎందుకూ?"

"పుణ్యం వస్తుందండీ."

"పుణ్యం అంటే ....?"

"పుణ్యం అంటే ..." అని కాస్సేపు ఇటూ అటూ చూసి "అమ్మా! పుణ్యం అంటే ఏమిటి?" అని తల్లిని అడిగాను.

నేను వెంటనే కలగజేసుకుని "సరేలే, పుణ్యం వస్తే?" అన్నాను.

"పెద్ద ఉద్యోగం వస్తుందండీ! బోలెడు డబ్బు వస్తుంది. మేడ కట్టుకోవచ్చు."

కొడుకు కబుర్లకి దుర్గాంబ ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ కూర్చుంది.

ఆ పిల్లలిద్దర్నీ చూస్తుంటే నాకేదో ఆవేదన కల్గింది. ఎలాచెప్తే అలా వినేంత విధేయత గల పిల్లలు! ఏది చూసినా అడిగి అడిగి తెలుసుకోవాలనే ఉత్సాహం వున్న పిల్లలు! .... కానీ, ఎంతకాలం ఉంటుందా ఉత్సాహం? వాళ్ళకి అన్నీ తప్పుడు మాటలు నేర్పుతోంటే వాళ్ళు నేర్చుకునేదే ముంటుంది?

పసిబిడ్డల హృదయాలు సుక్షేత్రాల్లాంటివి. వాటిలో ఏ విత్తనం పడితే ఆ మొక్కే లేస్తుంది కదా?

"ఓసేయ్! బండి ఆగుతోంది. మళ్ళీ స్టేషన్ వస్తోంది. గమ్మని కూర్చోండి. జనం వచ్చి మీద పడ తారు. ఖాళీ లేదు పొమ్మనండి. వాళ్ళే పోతారు" — అంతకు ముందు స్టేషన్లలో కూడా ఆవిడ అలాగే చెప్పినట్టు జ్ఞాపకం వచ్చింది.

"ఎందుకమ్మా పొమ్మనటం? ఖాళీ వుందిగా?"

"వెర్రి వెధవల్లా వాగక నోరు మూసుకుని కూర్చోండి! ఇదిగో! ఈ సంచీ మీ పక్కన పెట్టండి. కాళ్ళు బాగా చాపి కూర్చోండి."

పిల్లలిద్దరూ కాళ్ళు ఎడంగా పెట్టుకుని బెంచీ నిండా దురాక్రమణ చేసి కూర్చున్నారు.

రైలు ఆగింది.

సంచి పట్టుకుని లేచాను.

"మీరిక్కడే దిగుతారా?" అంది దుర్గాంబ.

"అవునండీ" అన్నాను.

పిల్లలకేసి చూశాను. "తప్పు! అలా కూర్చో కూడదు" అన్నట్టు నేను నవ్వుతూ ముక్కుమీద వేలేసుకుని చూపించాను.

వాళ్ళూ నవ్వారు. సరదాగా నాలాగే ముక్కుల మీద వేళ్ళేసుకున్నారు. ఆ మొహాలు నవ్వులతో మెరుస్తున్నాయి. వాళ్ళ పసి హృదయాలు కూడా అంటీ అంటని కల్మషంలోంచి కాంతిగా ప్రకాశిస్తోన్నట్టే ఊహించాను. ఇంకో ఇరవై సంవత్సరాల తర్వాత ఈ పిల్లల్ని కల్సుకుంటే? అప్పుడు ఎలా వుంటారో చూడ గలిగితే?

"వెళ్ళిపోతున్నావా రైలత్తా?" అంటూ మంజులత బెంచీ మీదనించి దూకింది.

"అవునమ్మా! మా ఊరు ఇదే. నే నిక్కడ దిగు తాను."

దీనంగా చూశారు పిల్లలు.

నవ్వుతూ అన్నాను. "నా పేరుకూడా మంజులతే! రైలత్త కాదు"

నిజంగా నా పేరు అదే. దుర్గాంబకి నచ్చని పేరు.

"భలే బావుంది, రైలత్త పేరుకూడా నా పేరే! మంజులతే!"

రైలుదిగి, పిల్లల్ని చూస్తూ ప్లాట్ ఫారమ్ మీద నించున్నాను.

"అమ్మా! రైలత్త మంచిది కదే?" పిల్లలు వాళ్ళ మ్మని అడగటం విన్పించింది.

"ఆఁ, అంతా మంచివాళ్ళే! వెధవ మంచి" అంటోంది దుర్గాంబ.

రైలు కదిలింది. పిల్లలిద్దరూ కిటికీ దగ్గరకు చేరి చేతులు ఊపారు.

వాళ్ళు చాలా దురదృష్టవంతులేమో అన్పించింది అప్పుడు.

ఆ అబ్బాయి డాక్టరవుతాడా?

ఆ అమ్మాయి? స్కూలు ఫైనల్‌తో చదువు చాలిస్తుందా?

వాళ్ళ పిల్లలకి కూడా మళ్ళీ వీళ్ళు ఇలాగే నేర్పు తారా?

['హాసీన్యూస్' మాస పత్రికలో. 1970 కన్నా ముందు కావచ్చు] ★